
# సినీ బేతాళ కథలు

– డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 27 -

## - చీర సాగరమదనం -

**విక్రమార్కుడు** మళ్లీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడక సాగించాడు.

"ఇంకో కథ చెబుతాను విక్రా!" అంటూ బేతాళుడు మొదలెట్టాడు.

"అప్పుడు యెప్పుడో అంజిబాబు అనే దర్శకుడు 'సతీ అరుంధతి' అనే పౌరాణిక చిత్రం మొదలెట్టాడు. షూటింగ్ మొదలైంది. అవాళ షాట్లన్నీ అరుంధతీ పతి వశిష్ఠమహర్షి మీద ప్లాన్ చేసుకున్నాడు. వశిష్ఠులవారిది హీరో వేషం. అయితే ఆ పాత్ర వేదపురుషుడైన బ్రహ్మర్షి పాత్రకావడంవల్ల రొటీన్ హీరోలు కాకుండా నిజజీవితంలో కూడా నిష్ఠగా వుండే పవిత్ర నటుడికోసం వెతికి వెతికి భల్లూకంబాబు అనే టివీ ఆర్టిస్టుని ఫిక్స్ చేసుకున్నారు. భల్లూకంబాబు క్రమశిక్షణగలవాడు. నిత్యం రామనామం జపిస్తూ వుంటాడు. ఎవరేనా తెలీక సిగరెట్టు కాలుస్తారా అని అడిగితే అగ్గిపెట్టె లాక్కుని అడిగినవాడి పెదాలు, మీసం కాల్చేస్తాడు. మందు తీసుకుంటారా అని అడిగితే, సైకిల్ మీద బజారుకెళ్లి బాటిల్ కొనుక్కొచ్చి అడిగినవాడి బుర్రమీద షోడా కలపని రా కీర్తన పాడేస్తాడు. రంకులేసే పిల్ల కావాలా అంటే వెంటనే టెంకిజెల్ల కొట్టేస్తాడు.

సరే - యిక కెమెరామన్ సంగతి. కెమెరామన్ పేరు సాగరఫట్. దర్శకుడు అంజిబాబు, కెమెరామన్ సాగరఫట్ ఆప్తమిత్రులు. సినిమా ఫట్ అయినా హిట్ అయినా అంజిబాబు సినిమాలన్నింటికీ సాగరఫట్టే కెమెరామన్.

మొదటి షాట్ టేక్ ముందుగా కెమెరామన్ సాగరఫట్‌ని, దర్శకుడు అంజిబాబు దగ్గరకు పిలిచాడు. రహస్యంగా ఒక మూలకి తీసికెళ్లాడు. 'ఏవిటి విషయం?' అడిగాడు సాగరఫట్.

'ఏవీలేదు. నాక్కాస్త అర్జంటు పనుంది. అలా వెళ్లొస్తాను-' అన్నాడు అంజిబాబు.

'అదేవిటి? ఫస్ట్ షాట్‌కేనా వుండకుండా వెళ్లిపోతావా? ఏవిటా అర్జంటుపని?'

'తొందరగానే వచ్చేస్తాలే.'

'ఈ భల్లూకంబాబుకి వున్నవే నాలుగు షాట్స్. నువ్వొచ్చేసరికి అయిపోతాయి.'

'అవనీకురా ఫటూ! అవ్వనీకు. నేను వచ్చేదాకా జాప్యంచేసి వాణ్ని కెమేరా ముందునుంచి కదలకుండా బిగించేసెయ్'

'ఎలా బిగించను? వాడు మంచి ఆర్టిస్టు. ఫస్ట్‌టేక్‌లోనే ఓకె అనిపించేస్తాడు.'

'ఈ సినిమాకి వశిష్టుడు హీరో, మాంఛి పివోటల్ రోల్, బాగా బాగా తియ్యడానికి ట్రై చేస్తున్నానని చెప్పు.'

'ఇంతకీ ఆ రాచకార్యమేవిటో నాకు చెప్పొచ్చుగా.'

'వచ్చాక చెబుతాలే'

'చూడు అంజిబాబూ! నువ్వు నా క్లోజ్ ఫ్రెండ్‌వి. అసలు విషయవేమిటో నువ్వు నాకు చెబితేనే నేను భల్లూకంబాబుని షాట్స్ తీస్తూ ఆపుతాను. లేకపోతే ఆ నాలుగు షాట్స్ చకచకా లాగేస్తాను. వాడు తిన్నగా యింటికి పోయి జపం చేసుకుంటాడు.'

'అంతపని చెయ్యకురా ఫటూ! నేనిప్పుడు అర్జంటుగా వొక ముఖ్యమైన మీటింగుకి వెళ్లాలి. నా మీటింగు బాగా జరగాలంటే, భల్లూకంబాబు నేను తిరిగి వచ్చేదాకా యిక్కడే సెట్లో సెట్టయిపోవాలి.'

'ఇంతకీ ఏవిటా మీటింగు?'

గట్టిగా అనకు - 'థండర్ థైస్' - అని చెప్పాడు అంజిబాబు.

'థండర్ థైస్ - అంటే తెలుగు చిత్ర భాషా పునరుద్ధరణ మీటింగా?'

'అలాంటిదేలే -'

'అంటే ఎలాంటిది?'

ఇక చెప్పేదాకా సాగరఫట్ వదలడని తేల్చుకుని అంజిబాబు అసలు సంగతి చెప్పేసాడు - 'అయితే విను. నేనిప్పుడు భల్లూకం బాబు యింటికే వెళ్తున్నాను. వీడి పెళ్లాం మాంఛి అయిటమ్ సాంగ్ డాన్సర్లా వుంటుంది. ఈ మధ్యే కాస్త లైన్లో పెట్టాను.'

'అదా విషయం. అదరహో! అదరహో - మరి అర్జంటుగా వెళ్లు. నువ్వు తిరిగొచ్చే దాకా వీడి సంగతి నాకొదిలెయ్' అని ఆప్తమిత్ర దర్శకుడు అంజిబాబుకి హామీయిచ్చి సాగనంపాడు కెమేరా సాగరఫట్. భల్లూకంబాబు వశిష్టుడి వేషంలో - 'అంతా రెడీయేనా? ' అని అరుస్తున్నాడు.

సాగరఫట్, 'రెడీసార్ - లైట్స్‌ఆన్, క్లోజ్‌షాట్ వొక్కసారి సెట్ చేసుకుంటా' అని, భల్లూకంబాబు దగ్గరకు వెళ్లి అతని ముఖానికి వేళ్లాడుతున్న పొడుగాటి తెల్లగడ్డాన్ని కెలుకుతూ, గడ్డిమేటులో సూదిని వెదుకుతున్నట్టు వెదకసాగాడు.

'ఏవిటి నాయనా! నా గడ్డాన్ని పాయలు పాయలుగా విడదీస్తూ వెదుకుతున్నావ్?' అని అడిగాడు వశిష్టుడి వేషంలో వున్న భల్లూకంబాబు.

'ఏవీలేదు సార్! మేకప్‌మన్ హడావుడిలో గడ్డాన్ని కొంచెం పైకి తగిలించాడు. తీసేది క్లోజ్‌షాట్ కదా! మీ ఫేస్ గడ్డం వెనకాల యెక్కడుందా అని వెతుకుతున్నాను' - అన్నాడు సాగర్‌ఫట్.

'పిచ్చివాడా! ఫేసు, గడ్డం పైన వుండునుగాని, గడ్డం లోపల వుండదు నాయనా! షాట్ తీసుకో' అన్నాడు భల్లూకం.

'సారీసర్! ఇప్పుడంతా సెట్టయిపోయింది.' అని సాగర్‌ఫట్ కెమేరా వెనక్కి వెళ్ళి - 'యాక్షన్!' అన్నాడు.

భల్లూకంబాబు వశిష్టుడిగా - 'అరుంధతీ!' అని అరిచాడు. ఆ శబ్దకంపనానికి అతని గడ్డం వూడి తెల్లటి మేఘంలా యెగిరి చంద్రుడిని కప్పేసినట్టు కెమేరా లెన్స్‌ని కప్పేసింది. వెంటనే కెమేరాఫట్, మేకప్‌మన్‌ని పిలిచి చెడామడా తిట్టేసి మళ్లీ భల్లూకంబాబుకి గడ్డం ఫిక్స్ చేయించి, 'ఈసారి అరుంధతీ! అని పిలవద్దుసార్! అది డబ్ చేసుకుందాం. జస్ట్ సైలెంట్ క్లోజ్ తీసుకుందాం' అన్నాడు. భల్లూకంబాబు 'సరే నాయనా! అలాగే చేద్దాం!' అని మౌనాభినయంతో వెలిగాడు.

"ఓకే సార్!' ఇప్పుడు వేరు వేరు యాంగిల్స్‌లో మరికొన్ని షాట్స్ చేద్దాం అని అదేపనిగా వరసగా షాట్స్ తీయసాగాడు సాగరభట్. భల్లూకంబాబు యెంతో ఓర్పుగా సహకరిస్తున్నాడు. లంచ్‌టైమయ్యింది. 'దర్శకుడెక్కడ నాయినా!?' అనడిగాడు భల్లూక వశిష్ఠుడు.

'ఏదో అర్జంటు మీటింగని వెళ్లారు. వచ్చేస్తారు.' అని బదులిచ్చాడు కెమెరాఫట్.

లంచ్ తర్వాత మధ్యాహ్నంకూడా షాట్స్ పరంపర కొనసాగిస్తున్నాడు సాగరుడు. సాయంత్రమైంది. మెల్లగా చీకటిపడింది. షూటింగ్ సాగుతూనే వుంది. దర్శకుడి జాడలేదు. భల్లూక వశిష్ఠుడు కిమ్మనకుండా వోర్పుతో సహకరిస్తున్నాడు. షాట్‌కి షాట్‌కీ మధ్య శ్రీరామ నామం స్మరిస్తున్నాడు. సాయంత్రం, రాత్రి సీన్లోకి మారుతోంది. కెమెరామన్ సాగరఫట్ బాగా అలిసిపోయాడు. భల్లూక వశిష్ఠుడు ఏమాత్రం నీరసం చూపించకపోగా, షాట్‌షాట్‌కీ యెంతో ఫ్రెష్‌గా అగుపిస్తున్నాడు. 'దర్శకులవారు యెప్పుడొస్తారు నాయనా?' అని అమాయకంగా అడుగుతున్నాడు.

ఇక కెమెరాఫట్ తట్టుకోలేకపోతున్నాడు. తన దర్శకమిత్రుడు అంజిబాబుకి మాటిచ్చినా, భల్లూక వశిష్ఠుడి ఓర్పు, భక్తిభావం సాగరఫట్‌ని కదిలించివేసాయి. 'ఈ మహోన్నత నటుడికా అన్యాయం? ఈ ఘోరానికా తను కాపు కాస్తున్నాడు.? ' మనస్సు బరువెక్కిపోయింది. ఆలోచించుకున్నాడు. డిలే చేస్తూ తను ఆడిన షూటింగ్ ఆట గురించి భల్లూకంబాబుకి చెప్పేయాలనిపించింది. అంజిబాబు యెంత మిత్రుడైనా అతడి అత్యాచారానికి ఆసరా పట్టడం సబబుకాదు. అసలు విషయం బైట పెట్టడం మిత్రద్రోహం కానేకాదు. బైట పెట్టకపోతే నిత్యం రామనామ స్మరణాభరణుడైన భల్లూక వశిష్ఠుడికి చేసేది దైవద్రోహం అవుతుంది. మనస్సులో సంక్షోభాన్ని భరించలేని కెమెరా సాగరఫట్ వొక నిర్ణయానికొచ్చేసి, భల్లూక వశిష్ఠుడిని సెట్లో వొక పక్కకి తీసుకెళ్లాడు. 'భల్లూకంగారూ! మీతో వొక ముఖ్యమైన విషయం చెప్పాలి. కానీ చెప్పడానికి నోరు రావడంలేదు. నా మనసు భయంతో వొణికిపోతోంది.' అన్నాడు.

'ఫరవాలేదు బాబూ! చెప్పు. ఏవిటో? షాట్స్ అనుకున్నట్టుగా రాలేదా? నా నటనలో ఏదన్నా లోపం జరిగిందా? సందేహించకు నాయనా చెప్పు! –' అన్నాడు నట వశిష్ఠుడు.

'చెప్పలేను సార్! చెప్పలేను – నన్ను క్షమించండి' అని సాగర్‌ఫట్ భోరుమంటూ కాళ్లమీద పడ్డాడు.

'లే బాబూ లే! ఏం భయంలేదు. చెప్పు. దర్శకులవారు రాగానే నేను మాట్లాడతాను.' అని సముదాయిస్తూ కెమెరాఫట్‌ని లేవదీసి, వశిష్ఠుడు 'యింతకీ దర్శకులవారు ఎప్పుడొస్తారు?' అని మళ్ళీ అమాయకంగా అడిగాడు. వెంటనే తిండి కరువైన పులిలా వాల్యూమ్ పెంచి మళ్లీ గాండ్రు భోరుమన్నాడు కెమెరాఫట్.

'శాంతించు ఫట్టూ శాంతించు. ముందు విషయం చెప్పు. చెప్పలేకపోతే కాగితం మీద రాసియ్యి. అదీ చెయ్యలేకపోతే పాట పాడుతూ, డ్యాన్సు చేస్తూ చెప్పు–' అని ధైర్యంపోస్తూ అడిగాడు నట వశిష్ఠుడు.

'నేను రైటర్ని కాదు. రాయలేను. నేను పాడితే మీరు పరమపదిస్తారు. ఆడితే నా అంతం చూస్తారు. అంచేత ఎలాగో అలా చెప్పేస్తాను.' అని కెమెరా సాగరఫట్ ధైర్యం కూడదీసుకుని చెప్పాడు.' సార్! దర్శకుడు అంజిబాబు వెళ్లింది ఏ మీటింగూ, తొక్కాకాదు. మీ యింటికే వెళ్లాడు. మీ భార్యతో లస్కుటపా పాటకి ట్యూన్ కడుతున్నాడు. తనొచ్చేదాకా వర్క్ కంటిన్యూ చేస్తూ మిమ్మల్ని యిక్కడే ఫిక్సింగు చెయ్యమన్నాడు. మిత్రుడు కదా అని సరేనని మీకు వాడితోపాటు నేనూ ద్రోహం చేసాను. నేనొక పాపిని. నాకు నిష్కృతిలేదు.' అని వలవలా ఏడుస్తూ విలవిల్లాడిపోయాడు కెమెరా సాగరఫట్."

– అదీ విక్రమార్కా జరిగిన ఎపిసోడ్ ఇప్పుడు చెప్పు! నిజం తెలిసిన నటుడు భల్లూక వశిష్ఠుడి రియాక్షన్ ఏవిటి? తర్వాత ఏం జరిగింది? ఈ ప్రశ్నలకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావా నీ తల వెయ్యి క్లోజ్ షాట్స్‌కి లోనయి ఎడిటర్ కత్తెర వాతబడి ముక్కాతిముక్కలైపోతుంది" అని బేతాళుడు ముగించాడు.

బదులుగా విక్రమార్కుడు - "ఓ! బేతాళా! కెమెరాసాగరఫట్ సమాధానం విని భల్లూక వశిష్ఠుడు గడ్డం వూడిపోకుండా చిరునవ్వుతో తల పంకించి - 'నాయనా సాగరఫట్టూ! నా భార్య వొక నటీమణి. ఓసారి వొక కొబ్బరి చెట్టుకింద ప్రేమ సన్నివేశం చిత్రీకరిస్తూంటే ఆ కొబ్బరి చెట్టుమీద వున్న ఉడత బాగా యింప్రెస్ అయి వుడతాభక్తిగా ఓ కొబ్బరికాయను తెంపి సమర్పించింది. ఆ కొబ్బరికాయ నాభార్య తలమీద పడి ఆమెకు హెడ్ యింజరీ అయి అపోలో హాస్పిటల్‌లో చేరకుండానే మరణించింది. ఇది జరిగి కొన్ని సంవత్సరాలైంది. అప్పణ్నించే నాకు భార్యలేదు. భార్యేకాదు మరే విధమైన సెటప్పూ లేదు. ఎన్నో యేళ్లుగా నేను వొంటరివాణ్ని. ఏకాకిని. చేస్తే నటన, రామనామస్మరణ తప్ప నాకు మరో వ్యాపకంలేదు. అంచేత నా వొంటరి కొంపలో 'లస్కుటపా' పాటకు ట్యూన్ కట్టే ఆస్కారంలేదు. దర్శకుడైన నీ మిత్రుడు అంజిబాబు మనిద్దర్లో యెవర్ని యీ షూటింగ్‌లో రోజంతా ఫిక్స్ చేసెయ్యాలనుకున్నారో నువ్వే తేల్చుకో -" అని విశదీకరించాడు. అంతా విన్న సాగరఫట్ విస్మయ సముద్రంలో మునిగితేలి వచ్చీరాని ఈతకొట్టుకుంటూ నిజం వొడ్డుకి చేరాడు. చేరీచేరగానే - 'అంజిబాబూ!' అని దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు. ఆ అరుపు 'అంజిబాబూ! అంజిబాబూ! అంజిబాబూ!' అని స్టూడియో ఫ్లోరంతా ఎఖోయించింది.

- అందుకే బేతాళా!

అవ్యక్తా దీని భూతాని
వ్యక్త మధ్యాని భార్థ
అవ్యక్తనిధనా వ్యేవ
తత్రకా పరిదేవాన

- మనుష్య పశుపక్షాదుల శరీరముల పూర్వచరమావస్థలు తెలియనివి. మధ్యావస్థ మాత్రమే తెలియుచున్నది. ఈ అవస్థలు మార్చుట మానవుడి చేతిలో లేదు. నశించకుండా ఆపలేని శరీరములకై చింతయేల? - అన్నారోయ్ గీతాచార్యులు, శ్రీకృష్ణభగవానుడు -" అని సమాధానం చెప్పగానే, రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు యెగిరి వెళ్లి మళ్లీ చెట్టెక్కేసి, 'లస్కుటపా! వుస్కులడీ!' అని కొమ్మలూపుతూ పాడుకున్నాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments